విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 11, డిసెంబరు 2025

రైతుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా..!

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రైతుల సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు సీపీఐ పోరాడుతూనే ఉంటుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వరయ్య పేర్కొన్నారు. రైతులు పండించిన వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, తుఫాను వలన నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరుతూ నంద్యాల మార్కెట్ యార్డ్ నుండి స్థానిక ఎంఆర్ఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం రాస్తారోకో నిర్వహించారు. సీపీఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రాస్తారోకో కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వరయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ రైతులు ఇటీవల వచ్చిన మొంతా తుఫాను వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వారికి ఇంతవరకు నష్ట పరిహారం ఇవ్వలేదని వెంటనే తుఫాను వల్ల దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో ఈరోజు రైతుల కోసం ధర్నా చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో మొక్కజొన్న, వరి,టమాటా, ఉల్లి, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, వాటికి గిట్టుబాటు ధర లేక దళారులు ఇష్టారీతిన కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అరటి రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, గతంలో టన్ను 25 వేల రూపాయలుండగా నేడు 1000 నుండి 1500 రూపాయలకు పడిపోయిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరుగగా కేంద్రానికి కేవలం నాలుగు లక్షల ఎకరాల్లోనే పంట నష్టం జరిగిందని ప్రభుత్వ నివేదికలు అందజేసిందని, ఇది ఎంతవరకు సమంజసమని ఆయన నిలదీశారు. డోన్ ప్రాంతంలో టమోటా ధరలు పడిపోయాయని, అక్కడ జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామన్న ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితమైందన్నారు. రైతుల రుణాలు రద్దు చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్రకార్యదర్శి వర్గసభ్యులు కె. రామాంజనేయులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాకముందు రైతుల గురించి మాట్లాడి అధికారంలోకి వచ్చాక కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నాడని ఆరోపించారు. వేలాది ఎకరాల భూమిని పరిశ్రమల పేరిట కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని పేర్కొన్నారు. సినిమా రేట్లను పెంచుతున్న ప్రభుత్వం రైతుల పంటలకు గిట్టుబాటు ధర ఎందుకు కల్పించడం లేదని ఆయన నిలదీశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు మాట్లాడుతూ మొక్కజొన్న రైతులు గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్నారని, దళారులు 1200 రూపాయలకే మొక్కజొన్నను కొంటున్నారని, 3 వేల నుండి 4 వేల వరకు ధర చెల్లిస్తామన్న చంద్రబాబు రైతులకు వెంటనే గిట్టుబాటు ధరకు మొక్కజొన్న కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అరటి రైతులు తమకు గిట్టుబాటు ధర లేక పంటను దున్నేస్తున్నారని, ఇప్పటికైనా వరి పంటకు గిట్టుబాటులో కల్పించాలని లేకుంటే రానున్న రోజుల్లో రైతులతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారెడ్డి, సోమన్న, సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు భార్గవ్, భాస్కర్, సుంకయ్య, రాధాకృష్ణ, రమేష్, రఘురామమూర్తి, మోటా రాముడు, నాగరాముడుతో పాటు సిపిఐ, రైతు సంఘం నాయకులు, మహిళా సమాఖ్య నాయకురాలు లక్ష్మీదేవితో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం డిప్యూటీ తహసిల్దార్ కు వినతిపత్రాన్ని అందజేశారు.

విభిన్న ప్రతిభావంతులకు అండగా ఉంటాం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : విభిన్న ప్రతిభావంతులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా రాణించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవ్వాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో 66వ అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ చైర్మన్ గడుపూటి నారాయణ స్వామి, ఉమ్మడి జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ అధికారి రయిజ్ ఫాతిమా, డిఆర్డిఎ పీడీ శ్రీధర్ రెడ్డి, సెట్కూరు సీఈఓ వేణుగోపాల్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి కళ్యాణి, జిల్లా నైపుణ్య అధికారి శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ సాధారణ ప్రజానీకం, విభిన్న ప్రతిభావంతులనే తారతమ్యం లేకుండా సమాజంలో ప్రతి ఒక్కరు సమాన అవకాశాలతో ఎదగాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదన్నారు. డిసెంబరు 3న ముఖ్యమంత్రి చంద్రబాబు విభిన్న ప్రతిభావంతుల శ్రేయస్సు కోసం 'ఇంద్రధనస్సు' పథకాన్ని ప్రారంభించారని, విభిన్న ప్రతిభావంతులలో అపారమైన ప్రతిభ ఉందని, దాన్ని సరైన దారిలో వినియోగించుకుంటే జీవితంలో మరింత ఎత్తులకు చేరుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి మూడు నెలలకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహించి, అందులో వచ్చిన ఫిర్యాదులను వేగంగా పరిష్కరిస్తామని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే విభిన్న ప్రతిభావంతుల సమస్యలను కూడా ప్రత్యేక దృష్టితో పరిశీలిస్తామని భరోసా ఇచ్చారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ చైర్మన్ గడుపూటి నారాయణ స్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రారంభించిన 'ఇంద్రధనస్సు' పథకంలో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, టిడ్కో గృహాల్లో గ్రౌండ్ ఫ్లోర్ కేటాయింపు, సబ్సిడీ రుణాలు, ఎంపిటిసి/జడ్పిటిసి పదవుల్లో రిజర్వేషన్, ప్రతి జిల్లాలో దివ్యాంగ భవన్ ఏర్పాటు వంటి వరాలు ఉన్నట్లు తెలిపారు. నెలకు రూ.6వేలు పెన్షన్, డయాలసిస్ పేషంట్లకు రూ.10వేలు మంచానికే పరిమితమైన వారికి 15,000 మొదటి తేదీన అందజేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మస్తాన్ వలి, మహేశ్వర్ రెడ్డి, లక్ష్మీ ఓబులేసు, సుబుల్ భాష, రమణయ్య, బాలసుబ్బయ్య, గంగాధర్, నాగన్న, సుబ్బారావు, సుబ్రహ్మణ్యం, రామకిషోర్, మరియాదాస్, సుధాకర్, జహీరుద్దీన్, గురుమూర్తి, రంగస్వామి, డా.గ్రేస్ తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ సేవలు అందించిన విభిన్న ప్రతిభావంతుల ఉద్యోగులను మొమెంటో, శాలువాలతో కలెక్టర్, చైర్మన్ సత్కరించారు.

సంతకాల సేకరణ ఉద్యమం వేగం

విశాలాంధ్ర - పగిద్యాల : శ్రీశైలం నియోజకవర్గంలో జరుగుతున్న కోటి సంతకాల సేకరణ ఉద్యమం వేగంగా కొనసాగాయని ఈ నేపథ్యంలో, మొత్తం 63255 సంతకాలు పూర్తి కావడం విశేషం. ఈ సంతకాలతో నిండిన కరపత్రాలను జిల్లా కేంద్రానికి తరలించేందుకు ఏర్పాటు చేసిన వాహనాన్ని మాజీ శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్ప చక్రపాణి రెడ్డి బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. శిల్ప భువనేశ్వర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మీర్, మైనార్టీ నాయకులు అంజాద్ అలీ, మోమిన్ మునీర్ భాష,బిసిసెల్ అధ్యక్షుడు నాగరాజు,కౌన్సిలర్లు,కార్యకర్తలు, పాల్గొన్నారు.

విద్యతో పేదరికం దూరం

విశాలాంధ్ర - సంజామల:విద్యతో పేదరికం దూరం చేయొచ్చు అని అఖిల భారత రజక సంఘం జిల్లా అధ్యక్షుడు చాకలి నాగేంద్ర అన్నారు. బుధవారం సంజామల ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష అట్టలను పెన్నులను ఉచితంగా అందజేశారు. సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకొని తల్లిదండ్రుల ఆకాంక్షను నెరవేర్చాలని అన్నారు. పదవ తరగతి తొలిమెట్టని తొలిమెట్టులో విజయం సాధిస్తూ అలానే కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం షబ్బీర్ హుస్సేన్ ఉపాధ్యాయులు పరమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

అంతా.. పార్కింగ్

విశాలాంధ్ర - బనగానపల్లె: సబ్ రిజిస్టర్ కార్యాలయం ఆవరణంలో క్రయ విక్రయాల కొరకు వచ్చె ప్రజలు కాకుండా చుట్టు ప్రక్కన వాళ్లు ప్రతిరోజు బైకులు కార్లు నిలుపుదల చేస్తున్నారు. అంతేకాక సబ్ రిజిస్టర్ కార్యాలయం ఎదురుగా క్రయ విక్రయాల కోసం వచ్చే ప్రజల సౌకర్యార్థం రేకుల షెడ్లు వేయడం జరిగింది. అందులో కూడా బైకులు నిలుపుదల చేస్తున్నారు. దీంతో క్రయవిక్రయాల కొరకు వచ్చిన ప్రజలు కూర్చునేందుకు స్థలం లేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. దీంతో రిజిస్ట్రేషన్ కొరకు వచ్చే ప్రజలు సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని బైకులు కార్లు నిలుపుదల చేయకుండా చూడాలని కోరుతున్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

విశాలాంధ్ర - చాగలమర్రి : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సిడీపీఓ తేజేశ్వరి,తహసీల్దారు విజయ్‌కుమార్,ఎంపీడీఓ తాహీర్‌హుసేన్‌లు తెలిపారు.పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి బాల్య వివాహ నిరోధక అధికారుల శిక్షణా కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహాలను నిర్మూలించడానికి అధికారులందరం బాధ్యతాయుతంగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుశీల,హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మి నారాయణ,హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి,సూపర్‌వైజర్ రామలింగారెడ్డి,పంచాయతీ కార్యదర్సులు,విఆర్ఓలు, అంగన్‌రాడీలు, జిఎంఎస్‌కేలు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు స్వీట్లు అన్నదానం

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని గంగవరం గ్రామంలో సి పద్మనాభరెడ్డి 13వ వర్ధంతి వేడుకలను తెలుగుగంగ ప్రాజెక్టు చైర్మన్ చెన్నారెడ్డి గారి సంజీవ కుమార్ రెడ్డి బుధవారం ఘనంగా నిర్వహించారు. దివంగత మాజీ ఎంపీటీసీ ప్రముఖ పెద్దలు అయినటువంటి చెన్నా రెడ్డి గారి పద్మనాభ రెడ్డి సమాధి వద్ద ఆయన కుటుంబ సభ్యులు బంధుమిత్రులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి వర్ధంతి వేడుకలలో పాల్గొన్నారు. అనంతరం మానసిక వికలాంగుల పాఠశాలలో సుమారు 300 మంది విద్యార్థులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. టిజిపి చైర్మన్ సంజీవ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి దివంగత పద్మానాభ రెడ్డి విలువలు విశ్వసనీయత మాట తప్పని మడమ తిప్పని ప్రజల మనిషిగా నేటికీ ప్రజల హృదయాల కుటుంబ సభ్యులలో చెరగని ముద్ర వేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చెన్నా రెడ్డి గారి శివ లక్ష్మమ్మ నీటి సంఘం చైర్మన్ చేన్నారెడ్డి గారి అశోక్ కుమార్ రెడ్డి, డాక్టర్ హిమజా రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ రైల్వే ప్రతిపాదనలను ఆమోదించండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల నియోజకవర్గానికి సంబంధించిన పెండింగ్ రైల్వే ప్రతిపాదనల ఆమోదం కోసం అత్యవసరమని బుధవారం సాయంత్రం న్యూఢిల్లీ లోని రైల్వే మంత్రి కార్యాలయంలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌కు ఎంపీ, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ రైల్వే బోర్డులో ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్న అనేక ముఖ్యమైన రైల్వే ప్రతిపాదనలపై మీ జోక్యం కోరుతున్నామని, నంద్యాల, కర్నూలు, కడప, విశాలమైన రాయలసీమ ప్రాంత ప్రజలకు చాలా ముఖ్యమైనవనీ, వీటిని సకాలంలో అమలు చేయడం వల్ల ప్రాంతీయ కనెక్టివిటీ, అభివృద్ధి బాగా పెరుగుతుందన్నారు. పురోగతి కోసం ఎదురుచూస్తున్న అతి ముఖ్యమైన ప్రాజెక్టులలో ఒకటి దూపాడు - బేతంచెర్ల కొత్త రైల్వే లైన్, దీని పొడవు 47.61 కి.మీ. తుదిసర్వే ఇప్పటికే పూర్తయిందనీ, వివరణాత్మక అంచనా,డిపిఆర్ ప్రస్తుతం ప్రక్రియలో ఉన్నాయని, ఈ మార్గం కర్నూలు, నంద్యాల జిల్లాల మధ్య కీలకమైన లింక్‌గా పనిచేస్తుందన్నారు.ఓర్వకల్లు పారిశ్రామిక కారిడార్‌ను బలోపేతం చేస్తుందని, రాయలసీమ ప్రాంతంలో సరుకు రవాణాను పెంచుతుందని, డోన్ వద్ద లోకో రివర్సల్‌ను తొలగిస్తుందని, నంద్యాల, కర్నూలు మధ్య ప్రయాణ దూరాన్ని గణనీయంగా తగ్గిస్తుందని, నిధుల ముందస్తు కేటాయింపు, పరిపాలనా అనుమతి ఈ ప్రాంతం యొక్క ఆర్థిక, చలనశీలత అవసరాలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి రైల్వే మంత్రికి వివరించారు.

ఎండుతున్న శనగ

రోజురోజుకు వేరుకుళ్లు తెగుళ్ల ఉధృతి

ఆందోళన చెందుతున్న అన్నదాతలు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : వేరు కుళ్ళు తెగుళ్ల ఉధృతితో సెనగ పంట సాగుచేసిన అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రోజురోజుకు వేరుకుళ్ళు వ్యాప్తిచెందుతున్నడంతో పంట ఎండుటాగుల ఎండిపోతున్నది. తెగుళ్ల దెబ్బకు ఉన్న పచ్చదనం అంతా కనుమరుగై ఎండుటాకుల మొక్కలు కనపడుతున్నాయి. పంట బాగుంది అనుకునేలోపు వేరు కుళ్ళు తెగులు అన్నదాతలను కలవర పెడుతున్నది. మండలంలోని మీర్జాపురం, కొలిమిగుండ్ల,బెలుం,బెలుం సింగవరం గ్రామాల పరిధిలో రైతన్నలు దాదాపు రెండు వేల ఎకరాలకు పైగా రెండు నెలల కిందట వర్షాధారంగా సెనగ పంటను సాగు చేశారు. అధిక వర్షాల కారణంగా సాగు ప్రారంభంలో శనగ పంట దెబ్బతిని రెండోసారి సాగు చేసారు. ప్రభుత్వం కనీసం సబ్సిడీ సెనగ విత్తనాలు కూడా ఇవ్వకపోవడంతో రైతన్నలు ఆర్థికంగా నష్టపోయారు. ఆయా గ్రామాలలో ప్రస్తుతం పంట చాలాచోట్ల పూత, బుడ్డ దశలో ఉన్నది. ఈ దశలో వేరుకుల్లు తెగులు విజృంభిస్తుండడంతో పంట ఎండిపోయి దెబ్బతింటున్నది. ఎన్ని మందులు పిచికారి చేసినా తెగుల ఉధృతి తగ్గడం రైతులు వాపోతున్నారు. వేరుకుళ్ళు వైరస్ సోకిన మొక్క పూర్తిగా ఎండిపోయి దిగుబడి ఉండదని పంట కనుమరుగవుతుందని తెలిపారు. మరి కొన్ని రోజుల్లో దిగుబడి రావాల్సిన దశలో వైరస్ దాటికి పంట ఎండిపోతుండడంతో రైతన్నలు తీవ్ర కలవరం చెందుతున్నారు. కనీసం సాగు కోసం చేసిన పెట్టుబడి కూడా వస్తుందా రాదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. వ్యవసాయ అధికారులు పంటను పరిశీలించి తెగుల ఉధృతిని అరికట్టడానికి తగిన సూచనలను ఇవ్వాలని రైతన్నలు కోరుతున్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నంద్యాల జిల్లాలోని 7 నియోజకవర్గాలలో చేపట్టిన కోటి సంతకాల వినతి పత్రాలను వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నంద్యాల రాంసాయి ఎన్ క్లేవ్‌లోని వైసీపీ జిల్లా కార్యాలయానికి చేర్చడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నీసా,రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పాల్గొన్నారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించి కోటి సంతకాల కార్యక్రమ వివరాలను జిల్లా అధ్యక్షుడు, ముఖ్య నేతలు తెలిపారు. కోటి సంతకాల వినతి పత్రాలను మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి, వైసీపీ నేతలు రాష్ట్ర గవర్నర్ కు అందజేయడం జరుగుతుందన్నారు.

దుప్పట్లు పంపిణీ : మాజీ సర్పంచ్

విశాలాంధ్ర - బనగానపల్లె: తలరాతను మార్చేది ఒక చదువు మాత్రమేనని విద్యార్థినిలు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల నందు పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి తన తల్లిదండ్రుల కీర్తిశేషులు గురెడ్డి, లక్షమ్మ దంపతుల జ్ఞాపకార్థం బనగానపల్లెలోని ప్రభుత్వ హాస్టల్లో ఉన్న బాలికలకు 3,50,000 రూపాయలు విలువ గల 1000 దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిసి రాజారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ కాట్రేడ్డి మల్లికార్జున్ రెడ్డి, పట్టణ ఉప సర్పంచ్ బురానుద్దీన్, యాగంటి ఆలయ చైర్మన్ బండి మౌలిశ్వర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ అత్తర్ కలాం, మార్కెట్ యార్డ్ కమిటీ నెంబర్ భూషణ, టిడిపి యువ నాయకులు సంకేశ్వర్ రెడ్డి, నారాయణరెడ్డి ,బిసి బాల తిమ్మారెడ్డి, (చిచ్చా) బచ్చు శరత్చంద్ర, జి విజయనేశ్వర్ రెడ్డి, రామ మద్దిలేటి రెడ్డి , మధుసూదన్ రెడ్డి , విష్ణువర్ధన్ రెడ్డి, హాస్టల్ వార్డెన్లు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఎన్‌సిసి కమాండర్ సందర్శన

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలోని ప్రజ్ఞ డిగ్రీ కాలేజీని బుధవారం ఎన్ సిసి గ్రూపు 28 కామండర్ కల్నల్ అలోక్ త్రిపాఠీ, సివో శశి కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు ఎన్‌సిసి గురించి, ఎన్‌సీసీ ,సర్టిఫికెట్ వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. అన్ని రకాల ఉద్యోగాలలో ఎన్ సిసి విద్యార్థులకు రిజర్వేషన్ ఉంటుందని అందువల్ల విద్యార్థులందరూ ఎన్ సిసి ని ఉపయోగించుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ శివరామి రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి

విశాలాంధ్ర - నందికొట్కూరు : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని లేదంటే ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని నందికొట్కూరు వైఎస్ఆర్సిపి సమన్వయకర్త డాక్టర్ దార సుధీర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని స్థానిక పటేల్ సెంటర్ నందు కోటి సంతకాల కరపత్రాలను కార్యకర్తలతో కలిసి నంద్యాల వైసీపీ కార్యాలయానికి జెండా ఊపి వ్యానులో తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 60వేలు కోటి సంతకాల కరపత్రాలను సేకరించి నందికొట్కూరు పటేల్ సెంటర్‌లో వైసీపీ శ్రేణులతో కలిసి నంద్యాల వైసిపి కార్యాలయం తరలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జబ్బర్ ,పగిద్యాల మండల కన్వీనర్ పూల్యాల నాగిరెడ్డి, నందికొట్కూరు పట్టణ అధ్యక్షులు మన్సూర్ భాష , జడ్పిటిసిలు యుగేందర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, మరియు లోకేశ్వర్ రెడ్డి, చిన్న మల్లారెడ్డి, మల్లికార్జునరెడ్డి, నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ముఖ్య వైసీపీ నాయకులు, వైసిపి కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్టు పంపిణీ

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : పట్టణంలో వాలీబాల్ క్రీడల పట్ల ఆసక్తి ఉన్న యువతను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో బనగానపల్లె మార్కెట్ యార్డ్ చైర్మన్ కాట్రెడ్డి మల్లిఖార్జున రెడ్డి యువకులకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. బుధవారం పట్టణంలోని స్వామి నగర్ కాలనీ యువత వాలీబాల్ కిట్లు కావాలని కాట్రెడ్డి మల్లిఖార్జున రెడ్డినీ కోరడంతో ఆయన వాలీబాల్ కిట్లను తెప్పించి వారికి అందజేశారు.

గిరిజనులకు పొదుపులక్ష్మిపై అవగాహన

విశాలాంధ్ర - పగిద్యాల : ఆత్మకూరు మండల పరిధిలోని కొట్టాలచెరువ్వు గ్రామం లో పొదుపులక్ష్మి సి. సి మహమ్మద్ ఆధ్వర్యంలో చెంచు గిరిజనులకు అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సి.సి మహమ్మద్ మాట్లాడుతూ గిరిజనలు ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ పాలసీని సద్వినియోగం చేసుకోవాలని తద్వారా తమ కుటుంబాలు భరోసాగా జీవిస్తాయని అన్నారు. అదేవిధంగా గ్రామంలోని గిరిజనులందరూ పొదుపు గ్రూపులను అభివృద్ధి చెయ్యాలని అయన అన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

విశాలాంధ్ర - బనగానపల్లె రూరల్ : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల కార్యక్రమాన్ని చేపట్టారు. బనగానపల్లె పట్టణ వైయస్సార్ పార్టీ కార్యాలయం నుండి జెండా ఊపి టాటా ఏస్ వాహనంలో కోటి సంతకాల సేకరణలో భాగంగా బనగానపల్లె నియోజకవర్గంలోని 50, 200 వేల ప్రతులను జిల్లా పార్టీ కార్యాల యానికి బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పంపిచారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపి రెడ్డి , వైయస్సార్ పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ చల్లా విగ్నేశ్వర్ రెడ్డి , బనగానపల్లె నియోజకవర్గ పరిశీలకుడు భూమా కిషోర్ కుమార్ రెడ్డి, అవుకు మండల వైయస్సార్ పార్టీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : సమాజంలో ప్రజలు ప్రతి ఒక్కరూ మానవ హక్కులు, చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి భాస్కర్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా పొదుపు మహిళలతో సమావేశం నిర్వహించి మానవులకు ఎటువంటి హక్కులు ఉన్నాయో వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శివరామిరెడ్డి, ప్యానల్ న్యాయవాదులు సుబ్బయ్య, మోహన్, మున్సిపాలిటీ మేనేజర్ ఆనంద్, ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ బాలస్వామి తో పాటు న్యాయవాదులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాంతీయ ఆరోగ్య కేంద్రం తనిఖీ

విశాలాంధ్ర- కోవెలకుంట్ల:పట్టణంలోని 30పడకల ప్రాంతీయ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ ఎండి ముత్తుజావలి బుధవారం తనిఖీ చేశారు. బుధవారం జిల్లా కాయకల్ప క్లీనింగ్ అవార్డ్స్‌లో భాగంగా కోవెలకుంట్ల ఆసుపత్రి పరిశీలనకు క్వాలిటీ అధికారి వచ్చారు. ఈ సందర్భంగా వైద్యశాలలో అందుతున్న సేవలను ఆసుపత్రిలోని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వార్డు క్లీనింగ్ ,టాయిలెట్స్ క్లీనింగ్, రూములలో పరిశుభ్రత ,డస్ట్ బిన్ ల మెయింటెనెన్స్ తదితరు వివరాలను ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలో పట్ల, ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచుకోవడం పై ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆసుపత్రి సూపరిండెంట్ చంద్రశేఖర్ రెడ్డితో పాటు, గైనకాలజిస్ట్ సుజాత,జనరల్ సర్జన్ నవీన్ కుమార్, హెడ్ నర్స్ లక్ష్మీదేవి,సీనియర్ సిస్టర్స్ ఉమాదేవి, సరోజినీ దేవి, ఉమామహేశ్వరి, విల్సన్, శ్యాంబాబులు ఉన్నారు.

రసాయన ఎరువులతో నేలలు నిర్జీవం

విశాలాంధ్ర - చాగలమర్రి : విచ్చలవిడిగా రసాయనక ఎరువుల వాడకం, పురుగు మందుల పిచికారితో నేలలు తమ స్వభావాన్ని కోల్పోవ దంతోపాటు పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తాయని మండల వ్యవసాయ అధికారి రంగనేతాజీ తెలిపారు.ఈ రోజు మండలంలోని మల్లెవేముల గ్రామం నందు పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక ఎరువుల వాడకం వాటి ద్వారా కలిగే నష్టాల గురించి వివరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన "ధర్తి మాతా బచావో" అనే అంశంపై ప్రతీ పంచాయతీ పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహించి రైతులకు సమతుల్య ఎరువుల వాడకం గురించి వివరించడం జరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతుల ద్వారా అధిక రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి నేల ఆరోగ్యం కాపాడుకోవడమే కాకుండా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడి సాధిస్తూ రైతుకు మంచి గిట్టుబాటు ధర సాధించడమే ప్రధాన లక్ష్యం అని తెలిపారు.కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి ధేయం

విశాలాంధ్ర - పగిద్యాల : అమరావతిలోని సచివాలయం నందు బుధవారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడుని కలిసి నియోజకవర్గంలోని పలు సాగునీటి ప్రాజెక్టులకు నిధుల మంజూరు తదితర అంశాలపై చర్చించినా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి దృష్టిలో ఉంచుకొని రైతన్నల పంట పొలాలకు సాగునీరు అందించే దిశగా సాగుతున్నారని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

ప్రజా అభివృద్ధికి ఐక్యత అవసరం

మొలగలవల్లిలో రూ.20 లక్షల సీసీ రోడ్డుకు ప్రారంభం

గ్రామాల పురోగతికి పార్టీ రాజకీయాలు పక్కన పెట్టాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

విశాలాంధ్ర - ఆలూరు : ఆలూరు మండలం మొలగువల్లి గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, ఎంపీ.లక్ష్మణ్ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య కలిసి బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమని ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, రైతు, కూలీ సామాన్య ప్రజల అభివృద్ధికి గ్రామాలు స్వయంగా ముందుకు రావాల్సిన అవసరాన్ని వివరించారు. పార్టీ రాజకీయాలను పక్కన పెట్టి గ్రామాల అభివృద్ధి కోసం ప్రజలు సమిష్టిగా పనిచేయాలని, గ్రామీణ ప్రగతి కోసం ఐకమత్యమే ప్రధాన శక్తి అని ఆయన సూచిం చారు. అభివృద్ధి పనులు ఎవరైనా చేసినా అది గ్రామానికే మేలు అవుతుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ కలిసి పనిచే యాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్, సీపీఐ మండల కార్యదర్శి రామాంజనేయులు, చంద్రకాంత్ రెడ్డి, బసాపురం గోపాల్, టీడీపి మాజీ మండల కన్వీనర్ అశోక్ యాదవ్, సీపీఐ మాజీ సీనియర్ నాయకులు ఎర్రిస్వామి, పల్లి శ్రీరాములు, కె.వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పూల రామాంజనేయులు, మాజీ ఎంపీటీసీ కురువ శ్రీరాములు, బంగారు రామకృష్ణ, శిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

విశాలాంధ్ర - క్రిష్ణగిరి : అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు తొగర్చేడు గ్రామానికి చెందిన వై.రాజశేఖర్ తనకు వారసత్వంగా వచ్చిన 10 ఎకరాల పొలంలో పంటలు సాగు చేసుకుని ఉమ్మడి కుటుంబంగా జీవనం కొనసాగించేవాడు. గత ఐదు సంవత్సరాల నుండి అధిక వర్షాలతో పంటలు దిగుబడి రాకపోవడం, పంటలు వచ్చినప్పుడు ధరలు లేకపోవడం ప్రతి ఏడాది చేసిన అప్పులు ఏ విధంగా తీర్చాలని మనస్థాపానికి గురై ఉదయం ఎవరు లేని సమయంలో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యవసాయ పెట్టుబడుల కొరకు చేసినఅప్పులకు వడ్డీ కట్టలేక అప్పు ఇచ్చిన వారు ఇంటి చుట్టూ తిరుగుతూ ఉంటే అవమానాలు పాలయ్యే బదులు చచ్చేది మేలని మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మృతునికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కుటుంబ యజమాని మరణించడంతో కుటుంబం రోడ్డున పడకుండా ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరారు.

రైతులను అభివృద్ధి బాటలో నడిపిస్తా

విశాలాంధ్ర - చిప్పగిరి : ఆలూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ వైకుంఠం జ్యోతి సహకారంతో రైతులను అభివృద్ధి బాటలో నడిపిస్తానని రామదుర్గం సొసైటీ చైర్మన్గా ఎంపికైన లక్ష్మీకాంతం అన్నారు. బుధవారం రామదుర్గం సొసైటీ చైర్మన్గా లక్ష్మీకాంతం, డైరెక్టర్లు గా పరమేష్, ముసలప్పలు ప్రమాణస్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆలూరు బ్రాంచ్ కెనాల్ సాగునీటి సంఘం అధ్యక్షులు నగర దోన కిష్టప్ప, బెల్డోన సహకార పరపతి సంఘం అధ్యక్షులు కొండా రామాంజనేయులు,టిడిపి సీనియర్ నాయకులు రామదుర్గం తిమ్మయ్య ముఖ్య అతిథులకుహాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలూరు టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి సహకారంతో బెల్డోన, రామదుర్గం సొసైటీ బ్యాంకుల అభివృద్ధి తోపాటు అన్ని విధాల రైతులు అభివృద్ధి చెందుతారన్నారు. రైతులను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్క రైతుకు సొసైటీల ద్వారా రుణాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే ప్రతి ఒక్కరికి తెలుగుదేశం పార్టీలో న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కుందన గుర్తి సర్పంచ్ కొండా పురుషోత్తం, టిడిపినాయకుడు మాధవులు, కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

పోరాటం చేస్తాం.. ప్రభుత్వాన్ని నిలదీస్తాం

- రైతు ద్రోహానికి అడ్డుకట్ట వేస్తాం
- కర్నూలు జిల్లాకు 50 వేల కోట్లు ఇవ్వాలని డిమాండ్
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ
- ఆస్పరిలో రోడ్ల దిగ్బంధం ఉధృతం

విశాలాంధ్ర - ఆస్పరి : అరుగాలం కష్టించి పంట పండించే రైతును పట్టించుకోని ప్రభుత్వాలను రోడ్లపైకి దించి నిలదీస్తాం... ప్రభుత్వం దిగివచ్చేంత వరకు పోరాటం కొనసాగిస్తాం అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ గర్జించారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఆస్పరిలో బుధవారం నిర్వహించిన రోడ్ల దిగ్బంధం నిరసన భారీగా, విజయవంతంగా జరిగింది. బస్టాండు నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు వేలాది మంది రైతులు, పార్టీ కార్యకర్తలు నినాదాలు, జెండాలతో ఊరిని మార్మోగించారు. ట్రాక్టర్లతో పెద్ద ఎత్తున వచ్చిన రైతులు అంబేద్కర్ సర్కిల్ వద్ద రోడ్లను పూర్తిగా దిగ్బంధించి నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అధ్యక్షత వహించగా రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ రైతు ద్రోహి ప్రభుత్వాలు అని తీవ్రంగా విమర్శించారు. వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయించేందుకు రైతులు ఢిల్లీలో 12నెలల పాటు చేసిన పోరాటాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర బడ్జెట్ రూ.3 లక్షల కోట్లు కాగా, కర్నూలు జిల్లాకు కేవలం రూ.50 వేల కోట్లు కేటాయిస్తే అన్ని సాగునీటి ప్రాజెక్టులు పూర్తవుతాయని చెప్పారు. ముఖ్యమంత్రిది కుప్పం జిల్లా అయినప్పటికీ హంద్రీ-నీవా నీటిని కర్నూలుకు కాకుండా కుప్పంకు మళ్లించారని, ఫలితంగా జిల్లాకు రావాల్సిన 80 వేల ఎకరాల సాగునీరు నిలిచిపోయిందని మండిపడ్డారు. వేదవతి, గురు రాఘవేంద్ర, గుండ్రేవుల, ఆర్డీఎస్ కాలువలు ఇంకా పూర్తి కానప్పటికీ, జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు నోరు మెదపడం లేదు అని విమర్శించారు. చేతగాని దద్దమ్మలుగా ఎమ్మెల్యేలు ఉన్నారు. అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఆలూరు వేదవతి ప్రాజెక్టుకు నిధులు తీసుకురావడానికే టిడిపి పార్టీలో నాయకుడు లేడని అయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు సమస్యలు పరిష్కరించాలని, పత్తి పంటను క్వింటాలకు 12 వేలకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని, సీసీఐ పెట్టిన షరతులు రద్దు చేయాలని, అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ.50 వేలు పంట నష్ట పరిహారం ఇవ్వాలని, రైతుల ఆత్మహత్యలు ఆగేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, పంటలకు గిట్టుబాటు ధరలు, రైతు అప్పుల మాఫీ, అన్నదాతలకు రక్షణ ఇచ్చే విధానాలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు మునెప్ప, లెనిన్ బాబు, జిల్లా నాయకులు మదిలేటి శెట్టి, రాజ్యసాహెబ్, కారుమంచి, విరుపాక్షి, వీరేష్, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, సురేంద్ర కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నబీ రసూల్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయ్య, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, మండల నాయకులు కృష్ణమూర్తి, రమేష్, ఏఐవైఎఫ్-ఏఐఎస్ఎఫ్ నాయకులు లక్ష్మన్న, రామచంద్ర, శేఖర్, సీనియర్ నాయకులు ఉరుకుందప్ప, బ్రహ్మయ్య, ఉరుకుందు, ఏఐటీయూసీ నాయకులు హనుమంతు, చంద్రశేఖర్, రైతు సంఘ నాయకులు రంగన్న, బడేసాబ్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో రైతులు రోడ్ల దిగరేదనలో పాల్గొని కార్యక్రమాన్ని ఘనవంతం చేశారు.

పంటలకు మద్దతు ధర ప్రకటించాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ప్రకటించాలని, రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. సీపీఐ ,ఏపీ రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బుధవారం రైతు సంఘం కలెక్టరేట్ ఎదుట నగర సమితి ఆధ్వర్యంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి ఎస్.మహేష్ అధ్యక్షతన ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమానికి ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణా రెడ్డిలు ధర్నా నుద్దేశించి మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతన్న కష్టాలను తీర్చడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నాయన్నారు. అనంతరం డిఆర్ఓ మేడంకి రైతాంగ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు , నగర కార్యవర్గ సభ్యులు బిసన్న ,నాగరాజు ,నల్లన్న ,భద్రకుమార్, రాముడు రైతు సోదరులు ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రభుత్వానికి రైతులు పాడి కడతారు

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు రూరల్ : రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, రైతాంగాన్ని ఆదుకోకపోతే రైతులే కూటమి ప్రభుత్వానికి పాడిగడతారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.రామచంద్రయ్య కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం ఎమ్మిగనూరు పట్టణంలో సోమప్ప సర్కిల్ నందు ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమానికి సిపిఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.రామచంద్రయ్య మాట్లాడారు... ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపు అన్న గౌడ్, రైతు సంఘం నాయకులు కేసి జబ్బర్, భేటీ చిన్నన్న,మద్దిలేటి నాయుడు, సోమేశ్వర్ రెడ్డి, సిపిఐ నాయకులు రాజీవ్, గిడ్డయ్య,మాలిక్, బిజీ విరుపాక్షి, బీటీ వెంకటేష్, విజయేంద్ర,దాదావలి, తిమ్మ గురుడు,మల్లికార్జున గౌడ్, నరసింహులు, హనుమంతు, వీరేష్,రఫీక్, రంగస్వామి,నరసప్ప, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

విశాలాంధ్ర - కోడుమూరు : ఏఐటీయూసీ నియోజకవర్గ నాయకులు మద్దూరు చిన్న రాముడు అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బి.రాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తుఫానులు, అధిక వర్షాలు రైతుల్ని దెబ్బతీశాయని, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు గొల్లరాజు, వెంకటగిరిఎల్లప్ప,రామగిడ్డయ్య,గొల్ల వీరప్ప,కోడుమూరు రాజులు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

విశాలాంధ్ర- మంత్రాలయం : నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలోని స్థానిక తాసిల్దార్ కార్యాలయం వరకు సీపీఐ నాయకులు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ రమాదేవికి వినతులతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. విజయభాస్కర్ యాదవ్ మాట్లడుతూ రైతులకు పండించినటువంటి పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు లక్ష్మణ్ నాయక్, గబ్రేలో, మహబూబ్ ,హనుమంతు, ఉషేని, మాబుభూషణ, నరసన్నలు పాల్గొన్నారు.

11న రాష్ట్ర బాక్సింగ్ పోటీలకు ఎంపిక

విశాలాంధ్ర - కర్నూలు : రాష్ట్ర పురుషుల బాక్సింగ్ పోటీల కొరకు జిల్లాలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కర్నూలు జిల్లా బాక్సింగ్ సంఘం అధ్యక్షులు సురేష్ గౌడ్, చైర్మన్ పి.విజయ్ కుమార్, సంయుక్త ప్రకటనలో తెలియజేశారు కర్నూల్లోని అవుట్ డోర్ స్టేడియం లో ఈనెల 11వ తేదీన ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీని నిర్వహిస్తున్నట్లు వివరించారు ఈ పోటీలలో19 నుంచి 40 సంవత్సరాల లోపు వారు అర్హులు, 2006సంవత్సరానికి ముందుగా జన్మించిన వారు ఈ పోటీల్లో అర్హులని తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన బాక్సింగ్ క్రీడాకారులు డిసెంబర్ 13, 14 తేదీలో విజయవాడలోని లయోల కాలేజీలో నిర్వహించే సీనియర్ బాక్సింగ్ రాష్ట్ర పోటీలలో పాల్గొంటారని వివరించారు. ఆసక్తిగల జిల్లా బాక్సర్స్ ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనాలని వారు తెలిపారు.

పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాల్సిందే..!

విశాలాంధ్ర-పత్తికొండ: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.రాజా సాహెబ్, సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి పి.భీమ లింగప్ప, మండల కార్యదర్శి యు.కారుమంచి డిమాండ్ చేశారు. సీపీఐ, ఏపీ రైతు సంఘం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం పత్తికొండ అంబేద్కర్ సర్కిల్ కూడలిలో ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి బి.సురేంద్ర కుమార్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది రైతులు సాగుచేసిన పంటలు అధిక వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్నాయని, ఆశాజనకంగా పండిన పంటలకు మద్దతు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోవడం జరిగిందన్నారు. పత్తి పంట క్వింటానికి 12 వేలు, ఉల్లి పంట హెక్టార్ కు 50 వేలు, కంది పంటకు క్వింటానికి రూ.10వేలు చొప్పున ప్రభుత్వమే కొనుగోలుచేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యులు గురుదాస్, కృష్ణయ్య, పెద్ద ఈరన్న, గిడ్డయ్య గౌడ్, నెట్టికంటయ్య, మండల సహాయ కార్యదర్శి జోహరాపురం కాశి, సిద్ద లింగప్ప, రంగన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

విశాలాంధ్ర - వెల్దుర్తి : అధిక వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం చెల్లించాలని పత్తి పంటలను రూ.12వేలు ప్రభుత్వం కొనుగోలు చేయాలని స్థానిక పాత బస్టాండ్ సర్కిల్ నందు సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోక ధర్నాకి చిన్నమాదులు అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి టీ కృష్ణ మాట్లాడారు... ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు డి.రాజు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు, చిలిపి కృష్ణ ,బోయిన పల్లె రాముడు, నర్సాపురం, ఆంజనేయులు, చిన్న వ్యాపారస్తుల సంఘం అనీలు, భాష, రైతులు సూదేపల్లె రాజు, మద్దిలేటి సీమోను ,తదితరులు పాల్గొన్నారు.

ఆదోని జిల్లా చేసేవంతవరకు పోరాడుతాం

విశాలాంధ్ర - కౌతాళం: అన్ని విధాలుగా వెనుకబడిన పశ్చిమ ప్రాంతమైన ఆదోనిని జిల్లాగా ప్రకటించేంతవరకు పోరాటం ఆగదని కౌతాళం జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. బుధవారం ఆదోని బందుకు మద్దతుగా కౌతాళంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాదర్ లింగ స్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నా పాషా సాహెబ్, జేఏసీ నాయకులు మారుతి మోహన్, శేషి రెడ్డి, వైయస్సార్సీపి మండల కన్వీనర్ ప్రహల్లాద చారి, సర్పంచ్ పాల్ దినకర్, టీడీపీ నాయకులు కాశీ విశ్వనాథ్ రాజబాబు, వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షులు సయ్యద్ దూద్ బాషా, లక్ష్మణాచారి ,సుబ్బరాజు ,మాజీ సర్పంచ్ అవతారం, రైతు కూలీ సంఘం కార్యదర్శి జగదీష్ ముక్తకంఠంతో పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల దగ్గర నుండి జేఏసీ ఆధ్వర్యంలో ప్రతిభ హై స్కూల్, జే కే ఎల్ ఎస్ స్కూల్ మరియు శ్రీ విద్యా స్కూల్, విద్యార్థులతో భారీ ర్యాలీని ధర్మకర్త సయ్యద్ మున్నాభాషా సాహెబ్,నాయకులు జండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ వైయస్సార్ సర్కిల్ కు చేరుకొని మానవహారంగా ఏర్పడి ఆదోని జిల్లా సాధనకై పోరాడుతామని నినాదాలు చేస్తూ అనంతరం వక్తలు మాట్లాడారు.. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు ప్రజలు వ్యాపారస్తులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర-పత్తికొండ: విద్యార్థి దశ నుండే భూసార పరీక్షలపై అవగా హన పెంచుకోవాలని జిల్లా భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారిని హరి ప్రియ, సాంకేతిక యాజ మాన్య సంస్థ మేనేజర్ మారుతి యశ్వంత్ విద్యా ర్థులకు సూచించారు. బుధవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్ లో 8,9,10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మండల వ్యవసాయ అధికారి వెంకట రాముడు అధ్యక్షతన భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయంలో మెలుకువలు, పంటల సాగుకు మట్టి నమూనా సేకరణ, భూసార పరీక్ష పై వాటి ప్రయోజనాలు, ఎరువుల యాజమాన్యం మోతాదు వాడకం వంటి అంశాలపై శిక్షణ నిర్వహించి, డెమో ద్వారా విద్యార్థులకు అవగా హన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విగ్నేష్, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనాథ్, రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థినిలకు ఉజ్వల భవిష్యత్తు

విశాలాంధ్ర-గూడూరు: క్రీడలతో విద్యార్థినీలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గూడూరు జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాల పిడి శ్రీనివాసులు, సిరాజ్ పేర్కొన్నారు. ఈనెల 9న కర్నూల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన జిల్లా అంతర్ పాఠశాలల వాలీబాల్ పోటీల్లో గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలిచి కప్పును గెలుచుకుంది. బుధవారం గూడూరు పట్టణానికి చెందిన టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు సులేమాన్ ఆధ్వర్యంలో బాలికల జట్టును అభినందించి శిక్షణ ఇచ్చి క్రీడలకు ప్రోత్సహించిన ఉపాధ్యాయు లను శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పీడీ శ్రీనివాసు లు మాట్లాడుతూ జిల్లా అంతర్ పాఠశాలల పోటీల్లో మొత్తం 16 జట్లు పాల్గొనగా గూడూరు బాలికల జట్టు మొదటి స్థానంలో గెలుపొందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థినిలు 18 ఎంపిక

విశాలాంధ్ర - కల్లూరు : క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని కేవీఆర్ మహిళా కళాశాల నందు మంగళవారం త్రోప్స్ టెక్ కెరీర్ సోల్యూషన్స్ వారు ఇంజనీర్ ట్రెనీ పోస్టుకు గాను నిర్వహించిన జాబ్ డ్రైవ్ నందు 43 మంది పాల్గొనగా 18 మంది ఎంపిక అయినట్లు క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా.జి.శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ డా.కే. వెంకట రెడ్డి, జేకేసీ సమన్వయకర్త డా.ఎస్.మహబూబ్ బాషా తెలియజేశారు. ఇందులో కంపెనీ హెచ్ఆర్ఎస్ వీర, చిన్నకేశవ, జేకేసీ మెంటార్స్ కె.ఈశ్వర్, బి.స్వర్ణలత పాల్గొన్నారు.

రాయితీ వేరుశెనగ విత్తనాలు మంజూరు

విశాలాంధ్ర - పెద్దకడబూరు : రబీ పంటకు మండలానికి 40 శాతం రాయితీ కింద వేరుశెనగ విత్తనాలు మంజూరు అయినట్లు వ్యవసాయ అధికారిని సుచరిత తెలిపారు. బుధవారం పెద్దకడబూరులో ఆమె విలేకరులతో మాట్లాడుతూ కె-6 రకం క్వింటానికి మార్కెట్ ధర రూ.9,200 కాగా 40 శాతం రాయితీతో రూ.3,680 మినహాయించి రూ.5520 రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వేరుశెనగ విత్తనాలు డిసెంబర్ రెండవ వారం వరకు విత్తుకున్నట్లైతే మంచి దిగుబడులు పొందవచ్చునని తెలిపారు.

ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - హొళగుంద: గ్రామ సర్పంచ్ కురువ చాముండిశ్వరి ఆధ్వర్యంలో ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలని ఆదోని బంద్ మద్దూతుగా ఎల్లార్తి గ్రామంలో గ్రామ ప్రజలు విద్యార్థులు ర్యాలీతో మద్దూతూ తెలిపారు. వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ ఆలూరు ఆదోని పత్తికొండ ఎమ్మిగనూరు మంత్రాలయం నియోజకవర్గంలు కలిపి ఆదోని జిల్లా ఏర్పాటు చేయాని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో మహంతేష్, శేఖప్ప ,చితనంద ,రవి, పాల్గొన్నారు.

దివ్యాంగుల సభను జయప్రదం చెయ్యండి

విశాలాంధ్ర-దేవనకొండ : పట్టణంలో సిఎల్ఆర్ ఆఫీసు భవనంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, విహెచ్పిఎస్, మండల సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మాచాపురం వీరన్న, మండల ఉపాధ్యక్షుడు గుమ్మారాళ్ల రాజు ఆధ్వర్యంలో కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు దివ్యాంగుల పోరాట సమితి జిల్లా కమిటీ కోరిక మేరకు ఈనెల 13వ తేదీన దివ్యాంగుల సమస్యల కొరకై మంద కృష్ణ మాదిగ ఎమ్మిగనూరు పట్టణానికి రావడం జరుగుతుంది కాబట్టి 13వ తేదీ జరగబోయే దివ్యాంగుల సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మాచాపురం వీరన్న మాదిగ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కార్తీక్ కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు, గిడ్డయ్య మాదిగ, మారెప్ప మాదిగ, ఎం ఎస్పి ,మండల అధ్యక్షుడు పెద్దయ్య మాదిగ ,ఎంఎస్పి మండల ఉపాధ్యక్షుడు పొట్లపాడు పెద్ద రంగన్న మాదిగ, దేవదాసు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

గడ్డి వాము అగ్నికి ఆహుతి

విశాలాంధ్ర - ఆలూరు : ఆలూరు మండల కేంద్రానికి చెందిన రైతు బషీర్ ఇంటి వద్ద ఉన్న గడ్డి వాము బుధవారం సాయంత్రం అకస్మాత్తుగా అగ్నికి ఆహుతి అయింది. పశువుల కోసం ఎంతో కష్టపడి కొనుగోలు చేసిన గడ్డిని వాము రూపంలో భద్రపరిచినట్టు బషీర్ తెలిపారు. ఈ ఘటనలో గడ్డివాము పూర్తిగా దగ్ధమై, దాని విలువ దాదాపు రూ.30వేలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అగ్నికి కారణాలు తెలియరాలేదు. అగ్ని ప్రమాదంతో రైతు తీవ్ర ఆర్థిక నష్టాన్ని చవిచూశాడు. స్థానికులు ఫైర్ దేశానికి తెలియజేశారు. వారు ఘటన చోటుకు చేరుకుని మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ, అప్పటికే వాము మొత్తం అగ్నికి ఆహుతైంది. నష్టాన్ని ప్రభుత్వము అధికారులు పరిశీలించి సాయం అందించాలని బషీర్ కోరుతున్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

వాళ్ల కార్యకర్తలకే కండువాలు కప్పుకోవడం హాస్యాస్పదం

విశాలాంధ్ర - సి.బెళగల్ : వైసీపీ నాయకులు వాళ్ల కార్యకర్తలకే కండువాలు కప్పుకొని టీడీపీ వారు వైసీపీ పార్టీలో చేరారని చెప్పుకోవడం హాస్యస్పదంగా ఉందని మండల టీడీపీ నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్కులో మండల టీడీపీ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడుతూ మండల పరిధిలోని కంబదహాల్ గ్రామానికి చెందిన దాదాపు 150 కుటుంబాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు వైయస్సార్ పార్టీలో చేరారు అని వైయస్సార్ పార్టీ నాయకులు చెప్పుకోవడం సిగ్గుచేటని మంగళవారం వైయస్సార్ పార్టీలోకి చేరిన వారు వైయస్సార్ పార్టీ కార్యకర్తలేనని వారికి ఒక్కరికైనా టిడిపి సభ్యత్వ నమోదు కార్డు ఉంటే తీసుకొని రమ్మని వారు సవాల్ విచిరారు. మంగళవారం వైయస్సార్ పార్టీలో చేరిన వారంతా మొదటినుండి వైఎస్ఆర్ పార్టీలో ఉన్న వారేనని 24వ సంవత్సరంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నిన్న పార్టీలో చేరారని చెప్పుకున్న వారంతా వైయస్సార్ పార్టీకి సపోర్టు చేశారని దానికి సంబంధించిన ఫోటోలను వారు చూపించడం జరిగింది. పోయిన ఐదు సంవత్సరాల వైయస్సార్ పార్టీ పరిపాలనలో ఒక్క అభివృద్ధి చేయకపోగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో నియోజకవర్గంలో విష్ణువర్ధన్ రెడ్డి,ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం జరుగుతుందని ఆ అభివృద్ధిని చూసి త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్సార్ ఉనికిని కూడా కాపాడుకోలేక పోతుందని వారు భయపడి ఏది పడితే అది మాట్లాడడం సమంజసం కాదని మంగళవారం పార్టీలో చేరిన వారు తెలుగుదేశం పార్టీ వారు కాదని వారు వైయస్సార్ పార్టీ వారే అని మా దగ్గర అన్ని ఆధారాలున్నాయని నిరూపించడానికి సిద్ధంగా ఉన్నామని వారు సిద్ధంగా ఉన్నారా అని వారు అన్నారు. కంబదహాల్ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు సత్య రెడ్డి, సర్పంచు రాముడు, యాకోబు, నాగరాజుతో పాటు నాయకులు ఎంపీటీసీ వీరన్న గౌడ్, మండల కన్వీనర్ చంద్రశేఖర్, కొత్తకోట హరి, అమర్నాథ్ ధనుంజయ, విద్యా కమిటీ చైర్మన్ గోవిందు, డిష్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

VASTU HOUSING FINANCE

వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్
యూనిట్ 203 & 204, 2 వ అంతస్తు, "ఎ" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సేవ్రి (వెస్ట్), ముంబై 400015. మహారాష్ట్ర.
సిఐఎన్ సం. : యు65922ఎంహెచ్2005పిఎల్సి272501

స్వాధీనత ప్రకటన

[illegible]

క్ర. సం.	రుణగ్రహీత, సహ-రుణగ్రహీత పేరు మరియు లోన్ అకౌంట్ నెం.	డిమాండ్ నోటీసు తేదీ మొత్తం బకాయి	ఆస్తి యొక్క వివరాలు	స్వాధీనత రకం & తేదీ
1	సిద్దయ్య కోటూరు, రమాబాయి, డి. పెద్ద హోళా LP0000000176898 & LP0000000207681	12-05-25 13-05-25 నాటికి రూ.769306 & రూ.841469	ఆంధ్రప్రదేశ్, కర్నూలు జిల్లా-518502 [illegible]	భౌతిక స్వాధీనత స్వాధీనత తేదీ: 06-డిసెంబరు -2025

తేదీ : 11.12.2025
ప్రదేశము: కర్నూలు
అధీకృత అధికారి
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.

బుధవారం జిల్లా కలెక్టర్ కర్నూలు ఆర్టీసీ బస్ స్టాండ్ ను ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా బస్టాండ్ లోని రిజర్వేషన్ కౌంటర్, టాయిలెట్స్, డార్మిటరీ, ఉచిత త్రాగు నీరు, షాపులు, హెూటల్ లు, నిఘా భద్రత విభాగాలను కలెక్టర్ పరిశీలించారు.బస్ స్టాండ్ ఎంట్రన్స్ ప్రాంగణంలో పై కప్పు పెచ్చులు ఊడిపోవడాన్ని గమనించి, ప్రమాదాలు జరుగక ముందే త్వరితగతిన మరమ్మతులు చేపట్టి బాగు చేయించాలని కలెక్టర్ ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎంను ఆదేశించారు.టాయిలెట్ లను పరిశీలిస్తూ మెయింటెనెన్స్ బాగుందని, అయినప్పటికీ మరింత మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.శ్రీ లక్ష్మి వెంకటేశ్వర డార్మిటరీ నిర్వహణ సరిగా లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.డార్మిటరీ శుభ్రంగా

లేదని,ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా శుభ్రత పాటించాలని, ప్రయాణీకులతో గౌరవంగా మాట్లాడాలని కలెక్టర్ డార్మిటరీ సిబ్బందిని ఆదేశించారు.అనంతరం బస్ కండక్టర్ల కు సంబంధించిన ఎర్నింగ్ సెక్షన్ రికార్డు రూమ్‌ను కలెక్టర్ పరిశీలించారు.బస్ స్టాండ్‌లో ఏర్పాటు చేసిన త్రాగునీటి కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలిస్తూ, నీటిని తాగి చూశారు. త్రాగునీటి కేంద్రం వెనుకభాగం నుండి చెడు వాసన వస్తోందని గమనించిన కలెక్టర్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎంను ఆదేశించారు.బస్ స్టాండ్ పరిసరాల్లో ఉన్న షాపులు, హెూటళ్లను కలెక్టర్

పరిశీలించారు. ఈ సందర్భంగా షాపుల్లో అమ్ముతున్న వాటర్ బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్లు వంటి ప్యాకేజ్డ్ ఫుడ్ ఐటమ్స్‌పై గడువు తేదీలు ఉన్నాయో లేదో కలెక్టర్ తనిఖీ చేశారు. హెూటల్ నిర్వహణలో శుభ్రత ఖచ్చితంగా పాటించాలని, నాణ్యమైన నూనెను ఉపయోగించాలని, అలాగే అధిక ధరలకు అమ్మిన పక్షంలో కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యం, ప్రయాణికుల సౌకర్యం దృష్ట్యా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని కలెక్టర్ తెలిపారు.ప్రజా రవాణా భద్రతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో కలెక్టర్ బస్సు డిపోలోని నిఘా మరియు భద్రతా విభాగాలను ప్రత్యక్షంగా పరిశీలించారు.

డీజిల్ నిల్వ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్, డీజిల్ యొక్క సాంద్రత మరియు ఉష్ణోగ్రతను స్వయంగా పరిశీలించారు. ఇంధన నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

స్త్రీ శక్తి పథకం ప్రయోజనాలపై ప్రయాణికుల ప్రశంసలు : స్త్రీ శక్తి పథకం అమలు ద్వారా ప్రజలకు ఏ విధంగా లాభం చేకూరుతుందో తెలుసుకునేందుకు కలెక్టర్ కర్నూలు - నంద్యాల సర్వీస్ బస్సులోకి ప్రవేశించి ప్రయాణికుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.. అదే విధంగా బస్సులో శుభ్రత, ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారా వంటి అంశాలపై కలెక్టర్ ప్రయాణికులను ఆరా తీశారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మంచి లబ్ధి చేకూరుతోందని, బస్ స్టాండ్‌లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు సంతృప్తికరంగా ఉన్నాయని ప్రయాణికులు కలెక్టర్‌కు వివరించారు.జిల్లా కలెక్టర్ వెంట ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, డిపో మేనేజర్ లు , ఏపీఎస్ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ చూపండి

విశాలాంధ్ర - పగిదాల : ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ప్రతిఒక్కరూ క్రీడల్లో ప్రతిభ చూపించి ఉద్యోగ అవకాశాలు పొంది కుటుంబాలకు ఆసరగా ఉండాలని విజయవాడ జనంలో మనం స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పొదిగింటి. నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా నిన్న ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఆహ్వాన వాలీబాల్ క్రీడలకు ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారుల కోసం మంచి క్రీడా పాలసీలను ఏర్పాటు చేసిందని ప్రతిఒక్కరూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని అలాగే ఆరోగ్యంగా కూడా ఉండవచ్చున్నారు. రాష్ట్రం లో ఎక్కడ లేని విధంగా ఫస్ట్ టైమ్ వాలీబాల్ ఇండోర్ స్టేడియం ఆత్మకూర్ లో చూస్తున్నామని క్రీడాకారులకు ఇండోర్ వాలీబాల్ ఏర్పాటు చేసిన ఘనత శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డికి దక్కుతుందని తెలిపారు.క్రీడాకారులకోసం తనవంతు సహాయం ఎల్లప్పుడు ఉంటుందని తెలిపారు. క్రీడాకారుల కోసం అనుక్షణం తపిస్తున్న ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా ను అభినందించారు. ఈ టోర్నమెంట్ లో మొత్తం 20 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్ రాత్రి 2

గంటల వరకు జరిగాయి. ఈ ఫైనల్ మ్యాచ్లో మొదటి మరియు రెండవ బహుమతి కోసం తాండ్రపాడు మరియు ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ టీం తలపడగా మొదటి బహుమతి తాండ్రపాడు టీం గెలిచి 12,000 బహుమతి అందుకున్నారు. రెండవ బహుమతి 7000 ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ టీం గెలిచింది. మూడవ బహుమతి 5000 విజయవాడ టీం గెలుపొందింది.క్రీడాకారులకు బోజన హాస్టల్ వసతి ఏర్పాటు చేశారు.రానున్న రోజుల్లో ఆత్మకూర్ స్టేడియం లో క్రీడాకారులకు జాతీయ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేలా కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ మున్సిపల్ కమిషనర్ రమేష్,సింగిల్ విండో చైర్మన్ షాబుద్దీన్ గారు,మాజీ మండల టీడీపీ అధ్యక్షులు శివప్రసాద్ రెడ్డి ,రాష్ట్ర మైనారిటీ సెల్ నాగూర్ ఖాన్ ,ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ గౌరవ అధ్యక్షులు రేడియం నూర్ , ఎన్టీఆర్ కేవీకే స్టేడియం ఇంచార్జి జునైద్ బాషా గారు,వాలీబాల్ కోచ్ నిమ్మి.కృష్ణ యాదవ్,టాటా బాషా ,ఆత్మకూర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : అన్ని శాఖల సమన్వయంతో జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని, ఇందు కోసం రూపొందించిన వంద రోజుల జాతీయ ప్రచార కార్యక్రమాన్ని పటిష్టంగా అమలుచేసి ప్రజల్లో సంపూర్ణ అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. బాల్య వివాహాల నిర్మూలనకు వంద రోజుల జాతీయ ప్రచార కార్యక్రమం నిర్వహణపై బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు, పోలీస్, విద్య, మున్సిపల్, పంచాయతీ రాజ్, డీఆర్‌డీఏ తదితర శాఖల జిల్లా అధికారులతో, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ లు, అంగన్వాడీ సూపర్వైజర్లు తదితరులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ%ొ%బాల్య వివాహాల నిర్మూలనకు సంబంధించి వంద రోజుల జాతీయ ప్రచారంలో మూడు దశల్లో నిర్వహించడం జరుగుతోందని, నవంబర్ 27 నుండి ప్రారంభమైన వంద రోజుల జాతీయ ప్రచార కార్యక్రమం వచ్చే ఏడాది మార్చి 8 వ తేదీ వరకు నిర్వహించబడుతుందన్నారు. మొదటి దశ నవంబర్ 27 నుండి డిసెంబర్

31 వరకు విద్యాసంస్థలలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో, వసతి గృహాల్లో బాల్యవివాహాలకు సంబంధించిన పోస్టర్లను ప్రదర్శించాలని కలెక్టర్ డిఇఓ, ఆర్ఐఓ లను ఆదేశించారు. విద్యార్థుల్లో డ్రాప్ అవుట్ రేటు తగ్గించడం కూడా బాల్య వివాహాల నిర్మూలనలో కీలకం అని, ఆ దిశగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిఇఓ ను ఆదేశించారు.రెండవ దశలో జనవరి 1 నుండి జనవరి 31 వరకు మసీదులు, చర్చిలు, దేవాలయాలకు సంబంధించిన మత పెద్దలు, నాయకులకు, వివాహాలు నిర్వహించే వారికి ప్రత్యేక అవగాహన కలిగించాలని,18 ఏళ్లు నిండని బాలికకు వివాహం జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని సూచించాలని కలెక్టర్ ఆదేశించారు.మూడవ దశలో ఫిబ్రవరి ఒకటవ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు గ్రామీణ స్థాయిలో అంగన్వాడి టీచర్లు, సచివాలయ సిబ్బంది, మహిళా పొదుపు సంఘాల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని, ఇంటింటా ప్రచారం, సమావేశాలు, మానవ హారాలు, గ్రామ సభల్లో ప్రత్యేక చర్చలు జరపాలని సూచించారు.కృష్ణగిరి, దేవనకొండ, ఎమ్మిగనూరు రూరల్ ప్రాంతాల్లో టీనేజ్ ప్రెగ్నెన్సీలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామని, వాటిని అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మెడికల్ అధికారులను, తహశీల్దార్లను ఆదేశించారు.సమీక్ష అనంతరం బాల్య వివాహాల నిర్మూలన కోసం వంద రోజుల ప్రచారానికి సంబంధించిన ప్రత్యేక ప్రతిజ్ఞ చేసి, ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్, అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు బాల్య వివాహాల నిర్మూలనపై సంతకం కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, ఐసిడిఎస్ పిడి విజయ, డిటిసి శాంతకుమారి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు జుబేదా బేగం, డిఆర్డిఏ పిడి రమణారెడ్డి, సోషల్ వెల్ఫేర్ డిడి రాధిక, బిసి వెల్ఫేర్ అధికారి ప్రసూన, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి, సిడిపిఓలు పాల్గొన్నారు.

బాలికలకు రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆడపిల్లలు రుతుక్రమ పరిశుభ్రతను పాటించడం ద్వారా ఆరోగ్యకరంగా ఉండవచ్చని నంద్యాలకు చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ అనుప్రియ సూచించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం రోటరీ, ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, రుతుక్రమ పరిశుభ్రతపై ప్రముఖ పారిశ్రామికవేత్త టీఎంసీ వేణుగోపాల్ కోడలు డాక్టర్ అనుప్రియ అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం పర్వత్ నసీం, ఇన్నర్ వీల్ క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్ గాయత్రీ దేవి, ప్రముఖ పారిశ్రామికవేత్త, రోటరీక్లబ్ డిస్టిక్ ఆఫీసర్ టీఎంసీ వేణుగోపాల్, ఇన్నర్ వీల్ క్లబ్ ప్రెసిడెంట్ కవిత, సెక్రటరీ బైసాని ఉమా మహేశ్వరి, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు రమాబాయి, టీఎస్ విజయలక్ష్మి, లక్ష్మీదేవి, విజయ గీత, స్వర?, శ్రీదేవి, పద్మజ వల్లి, వృక్షయజ్ఞం నిర్వాహకురాలు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పీపీపీ విధానాన్ని మానుకోవాలి

విశాలాంధ్ర-పత్తికొండ: రాష్ట్ర ప్రభుత్వం పిపిపి విధానాన్ని మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా పత్తికొండ నియోజకవర్గంలో చేపట్టిన 62 వేల సంతకాల సేకరణ పత్రాలను బుధవారం మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి ప్రత్యేక వాహనంలో జిల్లా కేంద్రానికి పంపడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి సేకరించిన కోటి సంతకాల పత్రాలను తమ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో గవర్నర్ కు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కొమ్ముదీపిక, ఎంపీపీ నారాయణదాసు, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, మాజీ సర్పంచ్ సోమశేఖర్, వైసిపి మండల కన్వీనర్ కారం నాగరాజు, జిల్లా నాయకులు బాబు రెడ్డి, శ్రీరంగడు, జిట్టా నాగేష్, వివిధ గ్రామాల సర్పంచులు, ఐదు మండలాల వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : కూటమి ప్రభుత్వపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రచ్చబండ ద్వారా సేకరించిన కోటి సంతకాల వినతి పత్రాలను జిల్లా పార్టీ కేంద్రానికి తీసుకెళ్లే వాహనాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే గంగుల, భూమా కిషోర్ రెడ్డిలు జెండా ఊపి ప్రారంభించారు. గంగుల మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడానికి వ్యతిరేకిస్తూ కోటి సంతకాలను ప్రజల నుండి సేకరించాలని పార్టీ నిర్ణయం మేరకు తాము నియోజకవర్గంలో 70వేల మంది ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించడాన్ని అంగీకరించలేదన్నారు. దీనిని బట్టి చూస్తుంటే ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపధ్యక్షులు నాసారి ప్రసాద్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, వైసిపి నాయకులు డాక్టర్ శీలం సురేంద్రనాథ్ రెడ్డి, గంగుల రామిరెడ్డి, అంబటి మహేశ్వర్ రెడ్డి, అజాద్, సింగం వెంకటేశ్వర్ రెడ్డి, నాగేశ్వరరావు, పెద్ద సంఖ్యలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక డంప్ సీజ్

విశాలాంధ్ర-హొళగుంద: ముద్దట మాగిలో మల్లికార్జున అవసరం లేకపోయినా అక్రమంగా ఇసుకను తరలించి, డంప్ చేసిన ఇసుకను రెవెన్యూ ఇన్స్పెక్టర్ మహేష్, రెవెన్యూ సిబ్బంది తో కలిసి ఇసుక ను సీజ్ చేసి రెవెన్యూ శాఖ కు అప్పగించడం జరిగిందనీ ఎస్సై దిలీప్ కుమార్ తెలిపారు. మండలంలో ఎవరైనా సరే అధికారుల అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక ప్రమాణ చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాలు, ఇండ్ల నిర్మాణం కోసం గ్రామ కార్యదర్శుల అనుమతి పొందితే అలాంటి వారికి ఇసుక రవాణా చేసే అర్హత ఉందని అన్నారు. అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వారికోసం ఫోన్ ద్వారా సమాచారం ఇస్తే పోలీసు సిబ్బంది ద్వారా వాహనాలు పట్టుకొని సీజ్ చేస్తామని అన్నారు.

ఏపీ టెట్ పరీక్ష కేంద్రాలను సందర్శించిన డీఈఓ

విశాలాంధ్ర - కల్లూరు : ఏపీ టెట్ 2025 పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. నగరంలోని అయాన్ డిజిటల్, దూపాడులోని కే.వి.సుబ్బారెడ్డి ఐయాన్ డిజిటల్ కేంద్రాలలను జిల్లా విద్యాశాఖాధికారి యస్.శ్యామ్యూల్ పాల్ సందర్శించారు. మొదటిరోజు 665 మంది అభ్యర్థులకు గాను 590 మంది హాజరయ్యారు. 75 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కాంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగలేదు. పరీక్ష ప్రశాంతంగా జరిగింది. టెట్ పరీక్ష డిసెంబర్ 21 వరకు కొనసాగుతుంది. డిపార్టెంటల్ అధికారులుగా, ఎంఈఓలు అయిన ఆదాం భాష, వినోద్ కుమార్ మరియు వనజ కుమారిలు వ్యవహరించారు.

ఆటల ఆధారిత అభ్యసనం ఉపయోగకరం

విశాలాంధ్ర-పత్తికొండ: ఆటల ఆధారిత అభ్యసనం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని ఉపాధ్యాయుడు మారుతి అన్నారు. బుధవారం స్థానిక రాజీవ్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జి ఎఫ్ ఎల్ ఎన్ 75 రోజుల

ప్రణాళికలో ప్లే బేస్ లెర్నింగ్, ఆటల ఆధారిత అభ్యసనం ద్వారా విద్యార్థులు చురుకుగా, ఉత్సాహంగా, ఆనందంగా నేర్చుకుంటారు అని, భాష మరియు అక్షరాస్యత అభివృద్ధి జరిగి వారిసమగ్ర అభివృద్ధికి దోహదం చేస్తుందని తెలిపారు.

చంద్రబాబు వైఖరిపై ఆగ్రహం

విశాలాంధ్ర - కోడుమూరు : ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి విధానంలో ప్రైవేటీకరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమానికి కోడుమూరులో విశేష స్పందన లభించింది. బుధవారం పట్టణంలోని కోట్ల హర్ష కార్యాలయం వద్ద సేకరించిన 60వేల సంతకాల వినతిపత్రాలను ప్రత్యేక వాహనంలో జిల్లా వైఎస్ఆర్‌సీపీ కార్యాలయానికి పంపించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోడుమూరు జెడ్పీటీసీ రఘునాథరెడ్డి, మండల కన్వీనర్ రమేశ్ నాయుడు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు.కార్యక్రమానికి ప్రధాన అతిథులుగా కోడుమూరు సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్,నియోజకవర్గ పరిశీలకుడు కర్ర హర్షవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం సేకరించిన సంతకాల పత్రాలను తరలించే వాహనాన్ని నేతలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోల్కల్ ప్రభాకరరెడ్డి, బెలగల్ సోమశేఖరరెడ్డి,రాంపురం శివరాముడు, ఆకుల రవి,విష్ణుదాస్, కౌలుట్ల,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులు భూసారాన్ని కాపాడుకోవాలి

విశాలాంధ్ర - సి.బెళగల్ : రైతులు భూసారాన్ని కాపాడుకొని నాణ్యమైన అధికదిగుబడులు సాధించుకోవాలని మండల వ్యవసాయ అధికారి జి మల్లేష్ కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని సంఘాల గ్రామంలోని గ్రామ రైతు సేవా కేంద్రంలో రైతులతో పొలం పిలుస్తోంది అనే కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన మాట్లాడుతూ పంట అవశేషాల యాజమాన్యం నేల ఆరోగ్య పరిరక్షణ గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది,ఎఈఓ హిమబిందు,విఎఏ దేవకుమార్,ఎంపిఈఓ ఈశ్వర్ రైతులు తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ వ్యతిరేకంగా 60 వేల సంతకాలు

విశాలాంధ్ర - ఆలూరు : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న కోటి సంతకాల ఉద్యమంలో భాగంగా, నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో సేకరించిన 60 వేల సంతకాల పత్రాలను బుధవారం రోడ్లు భవనాలు అతిథిగృహంలో నందు వాహనానికి జెండా ఊపి పంపించిన ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తున్న తీరు ప్రజాహిత విరుద్ధమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మొలగవల్లి చిన్న ఈరన్న, అర్థగిరి శీనప్ప, అరికెర వెంకటేష్, ఉరుకుంద, ముసానపల్లి సోమన్న, తుమ్మలవీడు సర్పంచ్ మల్లికార్జున, మండల కన్వీనర్ మల్లికార్జున, దేవనకొండ కిట్టు, ఆకుల ఎల్లప్ప, మాజీ ఎంపిటిసి భాస్కర్, వరుణ్, ఎస్కే గిరి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

విశాలాంధ్ర - ఓర్వకల్లు : ప్రజలకు అందుబాటులో ఉండి, మెరుగైన సేవలు అందించాలని, సచివాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ఆదేశించారు.బుధవారం ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామ సచివాలయాన్ని, సక్షం అంగన్వాడీ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సచివాలయంలో మూమెంట్ రిజిస్టర్, హాజరు పట్టిక తదితర కార్యాలయ సంబంధిత రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. సిబ్బంది హాజరు, సేవల అందుబాటు, ప్రజలకు అందిస్తున్న సేవల స్థాయి గురించి సిబ్బందితో ఆరా తీశారు. సచివాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరవ్వాలని జేసీ ఆదేశించారు. ప్రజలను సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా పనిచేయాలని స్పష్టం చేశారు. సేవలకు సంబంధించి పెండింగ్ లేకుండా ప్రాధాన్యతతో క్లియర్ చేయాలని సూచించారు.ఆ తరువాత గ్రామంలోని సక్షం అంగన్వాడి కేంద్రాన్ని కూడా ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడిలో నిర్వహణ, పిల్లలకు అందుతున్న ఆహారం, పోషణ ప్రణాళికల అమలుపై సమగ్రంగా పరిశీలించారు. పోషణ యాప్‌లో నమోదు చేసిన వివరాలు, రికార్డులు, హాజరు సమాచారం, పంపిణీ ప్రక్రియను కూడా పరిశీలించారు. పిల్లలకు సరైన పోషకాహారాన్ని తప్పని సరిగా అందించాలని, అంగన్వాడి పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, గర్భిణీ స్త్రీలకు టేక్ హెూమ్ రేషన్‌ను సక్రమంగా, ఏ లోపాలు లేకుండా అందించాలని జాయింట్ కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దార్ విద్యాసాగర్ రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు

భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - క్రిష్ణగిరి : క్రిష్ణగిరి మోడల్ స్కూల్ విద్యార్థులకు భూసార పరీక్షలపై వ్యవసాయ అధికారి మహేంద్ర బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ సాయిల్ హెల్త్ పథకంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు నేల ఆరోగ్యం గురించి తెలుపుతూ భూసార పరీక్షల ఆవశ్యకత, మట్టి నమూనాలు తీసే పద్ధతులను వారికి వివరించారు. మట్టి నమూనాలు తీసిన తర్వాత ల్యాబ్ పరీక్షల అనంతరం ఏ రకమైన భూమికి ఎలాంటి పద్ధతులు ఉపయోగిస్తే లాభాలు వస్తాయి సారవంతమైన నేలగా మారెందుకు వాడవలసిన ఆధునిక పద్ధతులను ఎరువులను వేసినట్లయితే పంట దిగుబడి వస్తుందన్నారు. విద్యార్థులు నేలపై అవగాహన కలిగి ఉండాలని ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం స్కూల్ సాయిల్ హెల్త్ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది భీమ్లా నాయక్, విలసిత, షబానా, మంజుల పాఠశాల ఉపాధ్యాయురాలు స్వాతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం

విశాలాంధ్ర - కల్లూరు : క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.ఇందిరా శాంతి అధ్యక్షతన, రాజ నీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో, అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.ఎం.ఇందిరా శాంతి మాట్లాడుతూ క్రీ.శ.1215లో ఇంగ్లాండ్‌లో హక్కుల మాగ్నాకారా మొదటిసారిగా ప్రకటించారని, ఆ తర్వాత గ్లోరియస్ రెవల్యూషన్, ఫ్రెంచి విప్లవం, రష్యా విప్లవం తదితర ఉద్యమాలు హక్కుల కోసం జరిగాయన్నారు.1948 డిసెంబర్ 10 న ప్రపంచ మానవ హక్కుల ప్రకటన సందర్భాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ప్రపంచమంతా మానవ హక్కుల దినోత్సవం జరుపుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జె. హేమంత్, ఐక్యూఏసి కో ఆర్డినేటర్ డా. ఫక్రున్నీసా బేగం, అకాడమిక్ కో ఆర్డినేటర్ ఎ. వెంకట స్వామి విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి

విశాలాంధ్ర - సి.బెళగల్ : త్రాగునీటి సౌకర్యం కల్పించి మాకు నీటి సమస్య లేకుండా చేయాలని సిబెలగల్ మహిళలు మొరపెట్టుకున్నారు. బుధవారం మండల అభివృద్ధి కార్యాలయం ముందు సి బెళగల్ గ్రామంలోని కమ్మరి ఆచారి వీధి, నాయుడు వీధి, చాకలి వీధి లోని మహిళలు ఖాళీ బిందెలతో మండల అభివృద్ధి కార్యాలయం ముందు బైఠాయించారు. చాలా రోజుల నుండి మా వీధులలో నీళ్లు లేక చాలా అవస్థలు పడుతున్నామని పక్క వీధిలోకి వెళితే అక్కడివారు అడ్డుకుంటే సుదూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు నెలలుగా అధికారులకు మరియు నాయకుల దృష్టికి తీసుకువెళ్లిన మా సమస్య పరిష్కారం కాలేదని ఇప్పటికైనా మాకు నీటి సమస్య తీర్చాలని లేదంటే ఈ సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని వారు అన్నారు. అనంతరం పంచాయతీ అభివృద్ధి అధికారి శ్యామలకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం తీసుకున్న అనంతరం శ్యామల మీ సమస్యను పరిష్కరించేందుకు చూస్తానని ఆమె అన్నారు.

వ్యవసాయ విధానాలపై రైతులకు శిక్షణ

విశాలాంధ్ర - పగిద్యాల : ఈ రోజు కృషి విజ్ఞాన కేంద్రం యాగంటిపల్లి మరియు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ వారి సంయుక్త అద్వర్యం లో సుస్థిర వ్యవసాయ విధానాలపై రైతు శిక్షణా కార్యక్రమం ఆత్మకూరు మండలంలోని, నల్లకాల్వ గ్రామంలో కేవీకే సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్ అధ్యక్షతన నిర్వహించారు. వీరు మాట్లాడుతూ పచ్చిరొట్టె పైర్లు,పంటమార్పిడి చేసుకొని నేల సారవంతం పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు వ్యవసాయ అధికారి పాల్గొని రసాయన ఎరువుల వాడకం తగ్గించి భూసారా అదారిత ఎరువులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమానికి కేవీకే శాస్త్రవేత్తలు బాలరాజు, రవిగౌడ్, మండల వ్యవసాయ అధికారి హేమలత, గ్రామ వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఆంధ్రప్రదేశ్‌లో 1994-2018 డిఎస్సిల ద్వారా నియమితులైన సుమారు 1.20 లక్షల ఇన్‌సర్వీస్ టీచర్లు ప్రస్తుతం "టెట్" అర్హత లేకపోవడంతో ఆందోళనలో ఉన్నారని ఆల్ మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు ఇమ్రాన్ పాష, రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్ ఎండి అబులైస్‌లు తెలిపారు. నంద్యాల పట్టణం సలీంనగర్‌లోని ఆల్ మేవా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో ఇచ్చిన మినహాయింపులను (జి.ఓ 27/2018, 31/2020) ప్రభుత్వం జి.ఓ 54 (12-11-2024) ద్వారా రద్దు చేయడం వలన టీచర్లకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, సుప్రీంకోర్టు తీర్పు, అనేక రాష్ట్రాలు ఇప్పటికే ఇచ్చిన రాయితీల నేపథ్యంలో, ఇన్‌సర్వీస్ టీచర్లకు ఆర్టీఈ యాక్ట్ 23(2) ప్రకారం వెంటనే మినహాయింపు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్లు నబిరసూల్, అమీరుద్దీన్, మీర్జా మాలిక్ బేగ్, సయ్యద్ మునీర్ అహ్మద్‌లు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనము నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా అదనపు పోలీస్ సూపరి ంటెండెంట్ ఎన్. యుగేంద్రబాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణారెడ్డి, సంస్థ డైరెక్టర్ జి. హేమంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని కామర్స్,మేనేజ్మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం. ఇంతియాజ్ అహ్మద్ నిర్వహించారు.ఎఎస్పీ ఎన్. యుగంధర్ బాబు మాట్లాడుతూ మానవ హక్కుల చరిత్రను వివరిస్తూ పూర్వం మనుషులకు సమాన హక్కులు లేవని, యునైటెడ్ నేషన్స్ చరిత్ర, చార్టర్ గురించి మాట్లాడారు. మన హక్కులు రాజ్యాంగంలో పొందుపరచబడ్డాయని, విద్యార్థులు బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. బాగా చదివి విజయాన్ని సాధించాల్సిందిగా ప్రోత్సహించారు.

యాగంటి ఆలయ ఛైర్మన్‌గా బండి మౌలిశ్వర్ రెడ్డి

విశాలాంధ్ర - బనగానపల్లె : నంద్యాల జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గా యాగంటి పల్లెకు చెందిన టిడిపి యువ నాయకుడు బండి మౌలిశ్వర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బండి మౌలిశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తనకు ఆలయ చైర్మన్‌గా పదవి రావడానికి సహకరించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, సతీమణి బీసీ ఇందిరా రెడి, మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, బిసి రామనాథ్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం

విశాలాంధ్ర - కల్లూరు : బి.క్యాంపు నందు గల క్లస్టర్ యూనివర్సిటీ వారు ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి హాజరయ్యారు. ప్రపంచంలో పౌర, రాజకీయ, హక్కులకు సంబందించి అంతర్జాతీయ ఒప్పందంపై అవగాహన కల్పించడానికి 1948 నుంచి ఏటా డిసెంబర్ 10న అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం అని తెలిపారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవంపై పెట్టిన వ్యాసరచన పోటీలలో ఉత్తీర్ణులైన క్లస్టర్ యూనివర్సిటీ విద్యార్థులకు, రాయలసీమ యూనివర్సిటీ విద్యార్థులకు జడ్జి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు.